క్లుప్తంగా

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య

తొండూరు : ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని సంతకొవ్వూరు గ్రామంలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దయ్య డెంగి, మలేరియా వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రమణ్యం, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాళి



ప్రమాద విషయం అడిగి తెలుసుకుంటున్న జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉంటున్న కళ్యాణ్ చక్రవర్తి కుమారుడు రాహుల్ (17) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సీకే దిన్నె జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులరెడ్డి మృతుడి ఇంటికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బస్సుకు ప్రమాదం



ప్రమాదానికి గురైన బస్సు

చింతకొమ్మదిన్నె : రాయచోటి నుంచి కడపకు వస్తూ గువ్వలచెరువు ఘాట్ పైన నాలుగో మలుపు వద్ద ఇంట్రాసిటీ ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సుకు పెను ప్రమాదం తప్పింది. బస్సు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లిన క్రమంలో అడ్డుగా వేసిన మట్టిదిబ్బ పైకి ఎక్కి ఆగిపోయింది. ఈ కారణంగా బస్సుకు పెను ప్రమాదం తప్పింది.

లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపరాదు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ ఘనమద్దిలేటి

తొండూరు : వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదని ఎస్ఐ ఘనమద్దిలేటి తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీటు బెల్టు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. మైనర్లకు, చిన్నపిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు బాధ్యులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ, కానిస్టేబుల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించండి



ప్రత్యేకావసర విద్యార్థుల సర్వేలో పాల్గొన్న జిల్లా అధికారులు

జమ్మలమడుగు : ప్రత్యేకావసరాలు గల పిల్లలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రంలో చేర్పించాలని జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ రమణమూర్తి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నాగులకట్ట ప్రాంతంలో ప్రత్యేకావసరాలు గల పిల్లల గుర్తింపు కోసం సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో పాల్గొన్న రమణమూర్తి మాట్లాడుతూ ప్రత్యేకావసరాలుగల పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించడం వల్ల వారికి విద్యతో పాటు వారికి ఎటువంటి అవసరాలు కావాలో గుర్తించి వాటిని అందించడం తోపాటు భవిష్యత్తులో వారి పనులు వారే చేసుకునేవిధంగా తయారు చేయడం జరుగుతుందన్నారు. భవితలో చేర్పించడం ద్వారా ప్రభుత్వం తరఫున వారికి రావలసిన బెనిఫిట్ తోపాటు తీసుకుని వచ్చినందుకు ఆయాలకు ప్రత్యేక అలవెన్సులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఎంఓ విశ్వనాథ్‌రెడ్డి, ఐఈఆర్‌పీ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్.. పరేషాన్

- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు
- వృద్ధులు, వికలాంగులకు తప్పని ఇక్కట్లు
- ఎండీయూ ఆపరేటర్ల తొలగింపుతో ప్రజలకు కష్టాలు



నగరిగుట్ట రేషన్ షాపులో రేషన్ బియ్యాన్ని స్వయంగా తూకం వేసుకుంటున్న లబ్ధిదారురాలు

పులివెందుల టౌన్ : గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రేషన్ బియ్యం ఇళ్ల వద్దకు వచ్చి ఎండీయూ ఆపరేటర్ల ద్వారా పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ పరేషాన్‌గా మారింది. ఎండీయూ ఆపరేటర్లను కూడా ప్రభుత్వం తొలగించినట్లు నిర్ణయం తీసుకుంది. దీంతో లబ్ధిదారులకు కష్టాలు తప్పడంలేదు. రేషన్ షాపులలో డీలర్లు ఇష్టానుసారంగా రేషన్ పంపిణీ చేస్తున్నారన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. రేషన్ షాపులకు వెళ్లే లబ్ధిదారులు తమ రేషన్ బియ్యాన్ని తామే సంచులలో వేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. కొన్ని షాపులలో అయితే 2 నుంచి 3 కేజీల వరకు బియ్యం తక్కువగా ఇస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇదేమని అడిగితే అంతే అంటూ దబాయిస్తున్నారని వారు వాపోతున్నారు. సంబంధిత అధికారులు కూడా విషయం తెలిసినా చోద్యం చూస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అయితే తమ ఇంటి వద్దకే బియ్యం ఇవ్వడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేదన్నారు. ఇప్పుడేమో రేషన్ షాపులలో రెండు, మూడు రోజులు రేషన్ పంపిణీ చేసి అయిపోయాయని డీలర్లు చేతులు దులుపుకుంటున్నారు. దీంతో దిక్కుతోచక ఏ రేషన్ షాపుకు వెళ్లాలో లబ్ధిదారులకు అర్థం కావడంలేదని ఆరోపిస్తున్నారు. పట్టణంలోని నగరిగుట్ట రేషన్ షాపులో ప్రతినెలా ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని తామే తమ సంచులలో వేసుకుని తూకాలు వేసుకునే పరిస్థితి కనిపిస్తోంది. రేషన్ బియ్యం కోసం డీలర్ వద్దకు వచ్చి తానే స్వయంగా పని మనిషి లాగా బియ్యం తూకాలు వేసుకునే పరిస్థితి దాపురించిందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందించే కంది పప్పు ఒక్కసారి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చక్కెర కూడా సరిగా పంపిణీ చేయలేదని ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో రేషన్ కార్డు లబ్ధిదారుల పరిస్థితి దారుణంగా తయారైందని వారు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఎండీయూ ఆపరేటర్లను ప్రభుత్వం తొలగిస్తున్నట్లు నిర్ణయం తీసుకోవడం మరింత ఇబ్బందిగా మారే పరిస్థితులు ఉంటాయని లబ్ధిదారులు అంటున్నారు. వృద్ధులు, వికలాంగులు తమ రేషన్ తీసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రేషన్ సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలని వారు కోరుతున్నారు.

రేపు ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ఉదయం ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. షుగర్ సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ముద్దనూరు : మండల కేంద్రంలో నేడు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ శ్రీనివాసులరెడ్డి శుక్రవారం తెలిపారు. రహదారి విస్తరణలో భాగంగా కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తుండటంతో విద్యుత్ సరఫరా వుండదని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

పట్టి పీడిస్తున్న స్టాంప్ పేపర్ల కొరత

కమలాపురం : కమలాపురంలో స్టాంప్ పేపర్ల కొరత పట్టి పీడిస్తోంది. స్టాంప్ రైటర్లే స్టాంప్ వెండర్లను గుప్పిట్లో పెట్టుకుని అధిక ధరలకు స్టాంప్ పేపర్లు విక్రయిస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంప్ పేపర్లు లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన స్టాంప్ రైటర్లు రూ.10 స్టాంప్ పేపర్ రూ.50కు, రూ.100 స్టాంప్ పేపర్ దాదాపు రూ.300 వరకు విక్రయిస్తున్నట్లు వినియోగదారులు తెలిపారు. స్టాంప్ పేపర్ల కొరత యాదృచ్ఛికమా? లేక స్టాంప్ రైటర్లే కొరత సృష్టించారా? అని క్రయ విక్రయదారులు వాపోతున్నారు. అధికారులు దృష్టి సారించి స్టాంప్ పేపర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ డీఎం బాషాను వివరణ కోరగా కార్యాలయంలో స్టాంప్ పేపర్లు లేని మాట వాస్తవమేనని, ఉన్నతాధికారులకు ఇండెంట్ పెట్టానని, రెండు రోజుల్లో స్టాంప్ పేపర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. స్టాంప్ వెండర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తన దృష్టికి రాలేదని, విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

రైతు బజార్‌ను త్వరలో వినియోగంలోకి తెస్తాం



మార్కెటింగ్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న సీఈఓ మాధవీలత

వేంపల్లె : వేంపల్లెలో నూతనంగా నిర్మించిన రైతు బజార్‌ను త్వరలో వినియోగంలోకి తెస్తామని చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి(సీఈఓ) మాధవీలత తెలిపారు. వేంపల్లెలో గత పాలనలో నిర్మించి వదలేసిన రైతు బజార్‌ను వినియోగంలోకి తేవాలని జెడ్పీ పాలక మండలి సమావేశంలో కలెక్టర్ దృష్టికి జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తీసుకొని రావడంతోపాటు పత్రికల్లో కథనాలు రావడం జరిగింది. శుక్రవారం వేంపల్లెలో నిరుపయోగంగా ఉన్న రైతు బజార్‌ను చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి మాధవీలత పరిశీలించారు. అలాగే రైతు బజార్ వినియోగంలోకి తీసుకరావడానికి ఉన్న సమస్యలను సంబంధిత మార్కెటింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వేంపల్లెలో రూ .1.20 కోట్లతో నిర్మించడం జరిగిందని, దళారుల వద్ద రైతులు మోసపోకుండా ఉండేందుకు రైతు బజార్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వినియోగదారులకు కూడా తక్కువ ధరలకు నాణ్యమైన కూరగాయలు రైతు బజార్లలో అందుబాటులో ఉంటాయన్నారు. వేంపల్లెలో నిర్మించిన రైతు బజార్ వినియోగంలోకి రాలేదని ఫిర్యాదు రావడం వలన రైతు బజార్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వేంపల్లెలో నిర్మించిన రైతు బజార్‌లో ఉన్న స్టాల్స్ అన్ని చాలా చక్కగా ఉన్నాయని, రైతు బజార్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు జిల్లా కలెక్టర్‌తో చర్చించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 125 రైతు బజార్లు ఉన్నాయని, రైతు బజార్‌లో ఉన్న స్టాళ్లను రైతులకు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ బత్తల రుచిత, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే విద్యుత్ లోక్ అదాలత్



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ ప్రసాద్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమలో ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ విద్యుత్ లోక్ అదాలత్‌లో ఇద్దరు వినియోగదారులు తమ సమస్యలను తీసుకొచ్చారన్నారు. ఒక రైతు అడిషనల్ లోడ్ కోసం 2001లో దరఖాస్తు చేసిన ఇప్పటివరకు ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వలేదని, మా సమస్యను పరిష్కరించలేదని వారి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే మరొక వ్యక్తి 2021లో విద్యుత్ బిల్లులు అధికంగా రావడం జరిగిందని లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని విన్నవించారు. దీనికి అధికారులు స్పందించి విద్యుత్ వియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రిటైర్ జడ్జి, ఆర్థిక సభ్యులు రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజన్‌కుమార్, చైర్మన్ శ్రీనివాస్ ఆంజనేయమూర్తి, సభ్యులు విజయలక్ష్మి, ఏడీలు గురుమోహన్, నాగేంద్ర, ఏఈలు జగదీశ్వర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న నూర్‌బాషా సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్

పులివెందుల టౌన్ : ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని నూర్‌బాషా సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో నూర్‌బాషా సంఘీయులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు 2024 ఎన్నికలలో భాగంగా కడప పట్టణంలో నూర్‌బాషా సంఘీయులకు మా ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.100 కోట్లు కేటాయిస్తామని, అలాగే ఎమ్మెల్సీ, మూడు నామినేటెడ్ పదవులు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంతవరకు ఏ ఒక్క హామీని కానీ, పదవులు కానీ ఇవ్వలేదన్నారు. ఇచ్చిన హామీలను ఆగష్టు 15వ తేదీలోపు నెరవేర్చకపోతే విజయవాడలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద రిలే దీక్ష చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మా సంఘానికి నిధులు, పదవులు కేటాయించాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు



ప్రథమ స్థానంలో నిలిచిన నంద్యాల జిల్లా ఎద్దు

చాపాడు : మండలంలోని విశ్వనాథపురంలో శ్రీవీరాంజనేయస్వామి జయంతోత్సవ వేడుకలలో భాగంగా రెండు రోజులుగా జరుగుతున్న వీరాంజనేయస్వామి తిరునాల శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన బండలాగుడు, చెక్క భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నంద్యాల జిల్లా ఎద్లకు ప్రథమ బహుమతి..

విశ్వనాథపురంలో జరిగిన బండలాగుడు పోటీలలో నంద్యాల జిల్లా మిడుతూరు మండలం అలగనూరుకు చెందిన కట్టుబడి రోలి మేడంకు చెందిన ఎద్లు ప్రథమ స్థానంలో గెలుపొందాయి. ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లెకు చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్లు ద్వితీయ, అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కొత్తపల్లికు చెందిన జొజ్జ విద్య ఓబుళరెడ్డి, నారాయణస్వామి ఎద్లు తృతీయ, ఇదే మండలం వరదాయపల్లెకు చెందిన బెస్త శ్రీరాములు ఎద్లు నాల్గవ, చాపాడు మండలం రాజువారిపేటకు చెందిన లింగారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఎద్లు ఐదవ, వేంపల్లె మండలం గాజులపేటకు చెందిన పసుపులేటి రమణయ్య ఎద్లు ఆరవ, వల్లూరు మండలం గోసురువారిపల్లెకు చెందిన పాపిరెడ్డి వెంకటరమణారెడ్డి ఎద్లు ఏడవ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల ఎజమానులకు వరుసగా రూ.70 వేలు రాజువారిపేట వెన్నపూస వెంకటసుబ్బారెడ్డి, రూ.50 వేలు అల్లాడుపల్లె గోసుల మునెయ్యగారి కిషోర్‌కుమార్‌రెడ్డి, రూ.40 వేలు అయ్యవారిపల్లె పి.మునిశేఖర్‌రెడ్డి, రూ.30 వేలు విశ్వనాథపురం గ్రామస్తులు, రూ.20 వేలు నెర్రవాడ బుర్రి నాగరాజు, రూ.10 వేలు వీవీ కొట్టాలు వి.రాజశేఖర్‌రెడ్డి, రూ.5 వేలు విశ్వనాథపురం మార్తల రమణారెడ్డిలు అందజేశారు.

ప్రజల గుండెల్లో తిరుగులేని నేత వైఎస్ రాజారెడ్డి



వైఎస్ రాజారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : తెలుగు ప్రజల గుండెల్లో తిరుగులేని నాయకుడు దివంగత నేత వైఎస్ రాజారెడ్డి అని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో దివంగత నేత, వైఎస్సార్ తండ్రి వైఎస్ రాజారెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దాయన వైఎస్ రాజారెడ్డికి పులివెందుల చరిత్రలో ఒక ప్రత్యేకత ఉందన్నారు. పేదలకు తమ కుటుంబాన్ని నమ్ముకున్న వారికి అండగా నిలిచేవారని, కరవు పరిస్థితుల్లోనూ ప్రజలకు అండగా నిలిచిన నాయకుడు చిరస్మరణీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, నూర్‌బాషా సంఘ రాష్ట్ర నాయకులు రసూల్, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిశోర్, రాష్ట్ర బూత్ కమిటీ సభ్యులు చంద్రమౌళి, కౌన్సిలర్లు కోడి రమణ, రాజశేఖర్, ఖాదర్ బాషా, కో ఆప్షన్ చంద్రమౌళి, నాయకులు సోపాల వీరా, పద్మనాభరెడ్డి, వీరారెడ్డి, సంపత్, రవి, మస్తాన్, కనక, కోళ్ల భాస్కర్, కృష్ణమూర్తి, ఫైర్ రామకృష్ణ, చెన్నకేశవులు, రమేష్, రాజేష్, బ్యాటరీ ప్రసాద్, బాల అశ్వత్థ రెడ్డి, తోటం శెట్టి హరి, శ్రీరామసుబ్బయ్య, బీసీ నాయకులు కార్తీక్, మారుతిరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జ్యోతుల ఉత్సవం

సింహాద్రిపురం : కొత్తూరు చౌడేశ్వరి దేవాలయంలో శని, ఆదివారాలలో జ్యోతుల ఉత్సవం నిర్వహించనున్నట్లు తొగట వీర క్షత్రియ, గ్రామస్తులు తెలిపారు. శనివారం సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు జ్యోతుల ఉత్సవం, కడవ బోనం కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ జ్యోతుల ఉత్సవంలో ప్రజలు విరివిగా పాల్గొనాలని వారు కోరారు.

అయ్యప్ప గురుస్వామి పుల్లయ్యకు ఘన నివాళి



పుల్లయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని ముత్యాలవారి వీధిలో నివాసముంటున్న పులివెందుల మొట్టమొదటి అయ్యప్ప గురుస్వామి పుల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్పలు శుక్రవారం మృతుడి ఇంటికి వెళ్లి పుల్లయ్య మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు పుల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. పుల్లయ్యస్వామిలేని లోటు తీరలేనిదన్నారు. కార్యక్రమంలో మాజీ ఆలయ చైర్మన్ యార్వ వెంకటసుబ్బయ్య, ఫైర్ రామకృష్ణ, మెకానిక్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు ప్రకటించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: టీడీపీ మహానాడులో చిత్తశుద్ధితో జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప నగరంలో తెలుగు దేశం పార్టీ మహానాడు ఈనెల 25 నుండి 29 వరకు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ మహానాడు లో జిల్లా లోని ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణాల పూర్తికి నిధులు కేటాయించాలన్నారు. కడప నగర జనాభా పెరుగుతోందని, నగరం పెద్ద ఎత్తున విస్తరిస్తోందని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం, మంచినీటి సప్లై అవసరాల కోసం నిధులు కేటాయించాలని కోరారు. గతంలో పులివెందుల కేంద్రంగా హార్టికల్చర్ అంతర్జాతీయ ఎగుమతుల గ్రేడింగ్ సెంటర్ ఉండేదని దాన్ని పునరుద్ధరించాలన్నారు.

పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలి


కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీకు న్యాయం చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు కోరారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కడపలోని కార్యాలయంలో ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సివి ప్రసాద్ ,రాధాకృష్ణలు కలిసి పదోన్నతులపై చర్చించి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో గ్రేడ్ 2 హెడ్మాస్టర్ పదోన్నతుల అడక్వసి వివరాలపై డీఈఓ చర్చించినట్లు తెలిపారు. ఎస్టీకి అడక్వసి పూర్తయిందని, ఎస్సీకి నాలుగు పోస్టులు రిజర్వేషన్ ద్వారా భర్తీ చేస్తామని స్పష్టంగా తెలిపారని వారు వివరించారు. అడక్వసి వివరాలను కూడా బహిర్గతం చేస్తామని తెలిపారని వివరించారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

కమలాపురం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న పనుల నాణ్యతలో రాజీ పడొద్దని సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయ సభా భవనంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి అధ్యక్షతన క్లస్టర్ పరిధిలోని టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ప్రస్తుతం రైతు పొలాల్లో జరుగుతున్న ఫాం పాండ్స్, పశువుల నీటి తొట్టెల నిర్మాణాల నాణ్యతలో రాజీ పడొద్దన్నారు. నిబంధనల మేరకు జాగ్రత్తలు పాటించి పనులు రికార్డు చేయాలన్నారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో రైతులను ఒప్పించి వారి పొలంలోనే కొంత విస్తీర్ణంలో ఫాం పాండ్స్, పశువులకు నీటి తొట్లు నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. ఇప్పటికే జరుగుతున్న పనుల్లో వేగం పెంచాలన్నారు. ముఖ్యంగా పనుల రికార్డును నిబంధనల మేరకు నమోదు చేయాలన్నారు. ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రామికుల సంఖ్యను పెంచి టార్గెట్ పూర్తి చేయాలన్నారు. పని ప్రదేశంలో శ్రామికులకు అవసరమైన సౌకర్యా లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పార్థసారథి, కమలాపురం, వల్లూరు, వీఎన్‌పల్లె, పెండ్లిమర్రి, చెన్నూరు, సీకేదిన్నె, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి



ఫారం పాండ్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

వల్లూరు : ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఆదిశేషారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గోటూరుకు చెందిన రైతు గంగాధర్ పొలములో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఫారం పాండును శుక్రవారం ఆయన సందర్శించారు. మండలంలో ఈనెల ఆఖరుకు మొత్తం 82 ఫారంపాండ్‌లు పూర్తి చేయవలసి ఉండగా ఇప్పటివరకు 28 పూర్తి చేసినట్లు, అలాగే ఇచ్చిన టార్గెట్‌ను తప్పని సరిగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రైతు గంగాధర్‌కు ఎరువు గుంత గురించి, దాని ఉపయోగాలను గురించి తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద ఎరువు గుంత ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం వుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో సుధారాణి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

చౌక దుకాణాల్లోనే రేషన్ పంపిణీ



జమ్మలమడుగులో మాట్లాడుతున్న తహసీల్దార్

చింతకొమ్మదిన్నె : జూన్ 1వ తేదీ నుంచి చౌక దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీని సరఫరా చేయాలని, ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవని చింతకొమ్మదిన్నె తహసీల్దార్ నాగేశ్వరరావు రేషన్ షాపు డీలర్లకు సూచించారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని డీలర్లలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇక నుంచి ప్రతి నెల 1 వతేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతి రోజు ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో ఉదయం 8.00 నుంచి 12.00 గంటల వరకు, సాయంత్రం 4.00 గంటల నుంచి 8.00 గంటల వరకు ఎఫ్.పి. షాపులను తెరిచి ఉంచాలని రేషన్ డీలర్లను ఆదేశించారు. 65 సంవత్సరాలు పైనఉన్న వారికి, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు. ప్రతిరోజు ఎంత మందికి సరుకులు సరఫరా చేస్తున్నారు అనే అంశాన్ని ప్రతి రేషన్ డీలర్ షాపులో ఫొటోలతో సహా రికార్డ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని కార్డుదారులు గమనించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని డీలర్లు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ యూనుస్‌బాషా, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయండి

లింగాల : రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని మార్చిందని, రేషన్ డీలర్లు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం ఆయన మాట్లాడుతూ బియ్యం పంపిణీలో తూకాలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. అదేవిధంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ నరేంద్ర, ఆర్ఐ గంగాధరరెడ్డి, మండలంలోని రేషన్ షాపుల డీలర్లు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అమ్ముకుంటే కార్డులు తొలగిస్తాం

జమ్మలమడుగు : లబ్ధిదారులు చౌకదుకాణాల్లో బియ్యం తీసుకుని అమ్ముకుంటే వారి రేషన్ కార్డులను తొలగిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల, పట్టణ పరిధిలోని రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 500కు పైగా ఉన్న రేషన్ షాపులను రెండుగా చేశామన్నారు. రేషన్ బియ్యం స్టాక్ పాయింట్ నుంచి తెచ్చుకునేటప్పుడు కచ్చితంగా తూకాలు వేసుకుని తెచ్చుకోవాలన్నారు. స్థానికంగా రేషన్ కార్డు లబ్ధిదారులకు బియ్యం అందకపోతే ఫిర్యాదులు చేయాలన్నారు. ఏ ప్రాంతంలో రేషన్ దుకాణం ఉందో ఆదే ప్రాంతంలోనే నడపాలన్నారు. ప్రతి ఒక్కరు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కచ్చితంగా రేషన్‌ను ఇవ్వాలన్నారు. స్టాక్‌పాయింట్ వద్ద నుంచి బియ్యం అమ్ముకోవడాలు చేస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీలర్‌లు, వీఆర్వోలు పాల్గొన్నారు.